క్లుప్తంగా

సుబ్రహ్మణ్యేశ్వరునికి ప్రత్యేక పూజలు



బూరుగుపూడిలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

కోరుకొండ: బూరుగుపూడి శివారులో శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠ బుధవారం ఘనంగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య ఉదయం యంత్ర బింబ – శిఖర, ధ్వజస్తంభ ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా స్వామివారిని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా దర్శించుకున్నారు. అలాగే హోమ నిర్వహణలో పాల్గొన్నారు. ఆయనను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సత్కరించారు. అలాగే ఆలయ నిర్మాణానికి రూ.ఐదు లక్షలు అందించిన కంటే వినయ్‌తేజ దంపతులను అభినందించారు. అనంతరం స్వామివారిని రాజా దర్శించుకుని, హోమం పూజల్లో పాల్గొని వేదపండితుల ఆశీర్వచనాన్ని అందుకున్నారు. ఆలయ అర్చకుడు మానేపల్లి సుబ్బారావు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు.

ఉపాధి పథకంపై గ్రామసభలు

సీతానగరం: ముగ్గళ్ల, ఉండేశ్వరపురంలలో 2025– 26కు గాను ఉపాధి హామీ పథకం పనుల గుర్తింపునకు బుధవారం గ్రామసభలు నిర్వహించారు. ముగ్గళ్లలో ఎంపీడీఓ ఎం.భారతి ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో కాలువలో ఉన్న గుర్రపు డెక్కను, ఏటిగట్టుపై పెరిగిన తుప్పలను తొలగించాలని రైతులు, గ్రామస్తులు కోరారు. అనంతరం 26 కాలువలు, చెరువుల్లో పూడికతీత పనులు, రెండు సేద్యపు నీటి గుంటలు, మూడు ఇంకుడు గుంటలు, ఐదు కంపోస్టు పిట్లు, రెండు పుంత రోడ్ల నిర్మాణం వంటి పలు పనులు గుర్తించారు. ఎంపీపీ గుర్రాల జ్యోత్స్న, సర్పంచ్ గెడ్డం భద్రలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి హేమంత్ వంశీకృష్ణ పాల్గొన్నారు. ఉండేశ్వరపురంలో ఏపీఓ టీవీ సత్యవతి ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి రజాక్, టీఏ వీరబాబు, కూటమి నాయకులు పాల్గొన్నారు

సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలి

రాజానగరం: యువ ఇంజినీర్లు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని నూతన ఆవిష్కరణలు చేయాలని ఐబీఎం ఇన్నోవేషన్ సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెలివరీ హెడ్ వికారుద్దీన్ సూచించారు. స్థానిక గోదావరి గ్లోబల్ యూనివర్సిటీలో బుధవారం ఐబీఎం ఆధ్వర్యంలో మోటివేషన్ కార్యక్రమం జరిగింది. సాంకేతిక రంగంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు అవగాహన చేసుకుంటూ నైపుణ్యాలను వృద్ధి చేసుకుంటే భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. జీజీయూ ప్రో.చాన్సలర్ కె.శశికిరణ్‌వర్మ మాట్లాడుతూ ఐబీఎం నిపుణులు అందిస్తున్న కోచింగ్‌ని సద్వినియోగం చేసుకుంటూ లక్ష్యాలను అందుకోవాలన్నారు. వీసీ డాక్టర్ యు.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు



శిక్షణలో మాట్లాడుతున్న సీతానగరం తహసీల్దార్ శ్రీనివాస్

సీతానగరం: మండలంలో 11 ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పీపీసీ శిక్షణను తహసీల్దార్ శ్రీనివాస్, ఎంఎస్ఓ నాగలక్ష్మి, ఏఓ గౌరీదేవి అందించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలుకు ఏర్పాటు చేసే కేంద్రాల్లో కాటాలు, తేమ శాతం కొలిచే మెషీన్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లతో పాటు సిబ్బంది కొరత లేకుండా చూడాలన్నారు. రైతులకు సంచులు అందించేందుకు సిద్ధం చేయాలన్నారు.

కొత్త బోర్లు వేయాలి

సీతానగరం: స్థానిక పంచాయతీలో రెండు కొత్త బోర్లు వేసి, తాగునీటిని అందించాల్సి ఉందని సర్పంచ్ కోండ్రపు ముత్యాలు తెలిపారు. బుధవారం స్థానిక సచివాలయంలో గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ (జీపీడీపీ)ను పంచాయతీ కార్యదర్శి నాగరత్నం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీలో వీధి లైట్లు అమర్చినా వర్షం నీరు వెళ్లి పాడైపోతున్నాయని, వాటి స్థానంలో ఎల్ఈడీ లైట్లు ఏర్పాటు చేస్తామన్నారు. ఉప సర్పంచ్ ద్వారంపూడి రామకృష్ణ, ఎంపీటీసీ వెన్నెల అప్పలనాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు వలవల వెంకట్రాజు, పెందుర్తి దేవదాసు, కూటమి నాయకులు మట్ట వెంకటేశ్వరరావు, కాండ్రు వీరన్న, దాసరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు

పరిసరాల శుభ్రతతో వ్యాధులు దూరం

అనపర్తి: పరిసరాల శుభ్రతతోనే సీజనల్ వ్యాధులు దూరమవుతాయని మండల ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస్ అన్నారు. బుధవారం స్థానిక నాలుగో సచివాలయం పరిధిలోని చాకలి వీధిలో ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ పి.శ్రీనివాస్, ఏఎస్ఎం చంద్ర, ఎంఎల్‌హెచ్‌పీ నిర్మల తదితరులు పాల్గొన్నారు.



కొల్లగొడుతున్న కోటికేశవరం కొండ



కోటికేశవరంలో కొండను ఇలా తవ్వేస్తూ..

ఆగకొండా కొల్లగొట్టి..

- కొండలను తవ్వేస్తున్న అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు

కోరుకొండ: ఇసుకను పిండేస్తారు.. మట్టిని మాయం చేస్తారు.. కొండలను గుల్లచేస్తారు.. అన్నట్లు కూటమి ప్రభుత్వ పాలన సాగుతోంది. అచ్చం అలానే రాజానగరం నియోజకవర్గంలో ఉంది. పాలకపక్ష నేతలంతా సిండికేట్‌గా మారి అందినకాడకు ప్రకృతి వనరులను దోచేస్తున్నారు. కోటికేశవరంలో ఎంతో చరిత్ర చెందిన పెద్ద కొండ ఉంది. దీనిపై 12 చోట్ల గ్రావెల్ తవ్వేశారు. సుమారు 40 ఎకరాల్లో విస్తరించిన ఈ కొండను 30 శాతం కొల్లగొట్టారు. నల్లగొండ– కోటికేశవరం మధ్యలోని సుమారు 100 ఎకరాల కొండను 40 శాతం మింగేశారు. శ్రీరంగపట్నం – మునగాలలో ఎత్తయిన కొండ ఉంది. సుమారు 40 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న కొండను తవ్వేస్తున్నారు. రాఘవపురం గ్రామానికి చేర్చి ఉన్న కొండ తవ్వకాలు ఇప్పుడిప్పుడే ప్రారంభమయ్యాయి. ఈ అక్రమ దందా యథేచ్ఛగా సాగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులకు ముడుపులు అందడంతోనే వాటి ఊసెత్తడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మైనింగ్, రెవెన్యూ శాఖలకు చెందిన అధికారులు ఇప్పటికైనా పట్టించుకోవాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

రాత్రిళ్లు.. టిప్పర్ల జోరు

పచ్చని పల్లెల్లో అలజడి సృష్టిస్తున్నారు. రాత్రి వేళల్లో అక్రమ రవాణాకు తెర తీస్తున్నారు. వీటి కారణంగా గ్రామాల్లోని రోడ్లు పాడవుతున్నాయి.



నల్లగొండలో కొండను 40 శాతం తవ్వేసి..

అసలే అంతంత మాత్రంగా ఉన్న రహదారులు మరింత పాడవుతున్నాయి. దీనివల్ల ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ టిప్పర్ల వేగానికి దుమ్ము రేగి నివాస ప్రాంతాలపై పడుతుందని ప్రజలు వాపోతున్నారు. టిప్పర్లను వేగంగా నడుపుతుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బెంబేలెత్తి పోతున్నారు. కోటికేశవరం నుంచి రాఘవపురం, శ్రీరంగపట్నం, కోరుకొండ మీదుగా వందలాది భారీ వాహనాలతో గ్రావెల్, మట్టి తరలిస్తున్నారు. ఒక్కో భారీ వాహనం ద్వారా రవాణా అవుతున్న గ్రావెల్‌కు రూ.6 వేల నుంచి రూ.8 వేలు తీసుకుంటున్నారు. రెడ్ మెటల్, లేటరైట్, గ్రావెల్, వైట్ కలర్ మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. ఇలా రూ.కోట్ల ప్రకృతి వనరులను కాజేస్తున్నారు. ఈ విషయమై అధికారులను 'సాక్షి' అడగ్గా మాట దాటేశారు.

రహదారులు.. గుంతలు

పల్లెల్లో భారీ వాహనాల రాకపోకలతో రోడ్లన్నీ గోతులమయంగా మారుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్ల అభివృద్ధిని మరిచింది. తాత్కాలిక మరమ్మతులతో సరిపెడుతోంది. ఈ నేపథ్యంలో ఉన్న రోడ్లు కాస్త రాళ్ల తేలి అధ్వానంగా తయారవుతున్నాయి. రాజానగరం నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా సారథ్యంలో నిర్మించిన రాజమహేంద్రవరం – సీతానగరం రహదారి మినహా, మిగతా రహదారులు అధ్వానంగానే ఉన్నాయి. ప్రతిరోజూ రాత్రి 100 లారీల వరకూ రవాణా జరుగుతుండటం గమనార్హం.



భారీ వాహనాల రాకపోకలతో ధ్వంసమైన రోడ్డు

ప్రకృతిని కాపాడండి



ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన కొండలు, గుట్టలు, కాలువలను ప్రభుత్వ అధికారులు పరిరక్షించేందుకు చర్యలు చేపట్టాలి. అప్పుడు వాతావరణ కాలుష్యం నుంచి కాపాడవచ్చు. కొందరి చేష్టలతో ఇవి కరిగిపోతున్నాయి. అలా జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కంటే వినయ్‌తేజ, వ్యవసాయ సలహా మండలి జిల్లా కమిటీ సభ్యుడు

ప్రభుత్వ ధనం స్వాహా



కొందరు కొండలను పిండి చేస్తున్నారు. ప్రభుత్వ ధనాన్ని స్వాహా చేస్తున్నారు. కూటమి ప్రభుత్వంలో ఇది యథేచ్ఛగా సాగుతోంది. ప్రకృతిని, సహజ సిద్ధ సంపదను కాపాడుతామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లకు నిజం కనబడటం లేదా..?

– నేతుల చిన్ని, ఉప సర్పంచ్, కోరుకొండ

కామేశ్వరరావు సేవలు చిరస్మరణీయం



అడ్డగర్ల కామేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రముఖులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): దేవదాయశాఖలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా దివంగత అడ్డగర్ల కామేశ్వరరావు అందించిన సేవలు చిరస్మరణీయమని పలువురు ప్రముఖులు కొనియాడారు. స్థానిక హోటల్ షెల్టాన్‌లో అడ్డగర్ల కామేశ్వరరావు పెద్దకార్యం సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కామేశ్వరరావు కుమారుడు అడ్డగర్ల జగన్‌బాబును పలువురు పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర రీజినల్ కోఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, వైఎస్సార్ సీపీ యువజన విభాగ రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, వైఎస్సార్ సీపీ సీఈసీ సభ్యులు ఆకుల వీర్రాజు, రౌతు సూర్యప్రకాశరావు, ఏపీఐసీసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళపు శివరామసుబ్రహ్మణ్యం, వైఎస్సార్ సీపీ యువజన విభాగ నేత జక్కంపూడి గణేష్, సినీ దర్శకుడు కురసాల కల్యాణ్, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), జనసేన పార్టీ సిటీ ఇన్‌చార్జి అత్తి సత్యనారాయణ, నందెపు శ్రీనివాస్, బోణం సతీష్, ఎస్‌డీఆర్ ధనరాజు, బొరుసు ఉదయభాస్కర్ తదితరులు సంతాపంలో తెలిపిన వారిలో ఉన్నారు.

చోరీ కేసు నమోదు

సీతానగరం: స్థానిక వాసి యర్రోజు రామాచార్యులకు చెందిన మోటారు సైకిల్ చోరీ గురైందని, దీనిపై కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్‌కుమార్ బుధవారం తెలిపారు. రామాచార్యుల వద్ద పనిచేసే వ్యక్తి మోటారు సైకిల్‌ను పురుషోత్తపట్నంలో మంగళవారం రాత్రి 10 గంటలకు ఉంచి, బుధవారం ఉదయం చూడగా కనిపించకపోవడంతో పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

జూదరుల అరెస్ట్

కాటవరం శివారులో పేకాటాడుతున్న పదకొండు మందిని అరెస్ట్ చేశామని ట్రైనీ ఎస్సై సురేష్ తెలిపారు. మంగళవారం పేకాట శిబిరంపై దాడి చేసి రఘుదేవపురం, చినకొండేపూడి, కాటవరానికి చెందిన పదకొండు మందిని అదుపులోకి తీసుకుని, వారి నుంచి రూ.50 వేలు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరు పరుచుతామని వివరించారు.

రొమ్ము క్యాన్సర్‌పై పీఎంపీలకు అవగాహన

అనపర్తి: స్థానిక ఎస్ఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో కమ్యూనిటీ పారా మెడికల్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పీఎంపీ అసోసియేషన్) అనపర్తి, బిక్కవోలు మండలాల ఆధ్వర్యంలో బుధవారం రొమ్ము క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. రాజమహేంద్రవరం డెల్టా హాస్పిటల్‌కు చెందిన శస్త్రచికిత్స నిపుణుడు డాక్టర్ రిమ్మలపూడి నితిన్, క్యాన్సర్ వైద్య నిపుణుడు డాక్టర్ సుమంత్ మండవ పాల్గొని పీఎంపీలకు అవగాహన కల్పించారు. డాక్టర్ నితిన్ మాట్లాడుతూ క్యాన్సర్‌కు సంబంధించి రోబోటిక్ విధానంలో అతి తక్కువ రక్తస్రావంతో, అతి తక్కువ నొప్పితో చికిత్స అందించవచ్చని తెలిపారు. క్యాన్సర్‌ను సకాలంలో గుర్తించి సరైన చికిత్స అందించడం ముఖ్యమని అన్నారు. క్యాన్సర్ వైద్య నిపుణుడు సుమంత్ మండవ మాట్లాడుతూ పర్యావరణం, జీవనశైలిలో మార్పులు, ప్లాస్టిక్ వినియోగం సంబంధిత కారణాలతో 80 నుంచి 90 శాతం మంది క్యాన్సర్ బారిన పడుతున్నారన్నారు. పీఎంపీల మండల అధ్యక్షుడు వాసంశెట్టి నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు బళ్లా శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి పి.దేవానందం, జిల్లా కోశాధికారి పి.చిన్ని, మండల కార్యదర్శి డి.సాయిరామారెడ్డి, కోశాధికారి నీలంశెట్టి శ్రీనివాస్, రాయవరం మండల అధ్యక్షులు ఎన్వీ రమణ, క్రాంతి కుమార్, ఎన్ఎస్ చలం, పీబీ సుబ్రహ్మణ్యం, పీటీఎల్ నారాయణ, కేఎస్ఎన్ మూర్తి, ఎస్.నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.



క్యాన్సర్‌పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరిస్తున్న డాక్టర్ నితిన్

కలాం జీవితం స్ఫూర్తిదాయకం



పులగుర్త జెడ్పీ హైస్కూల్‌లో అబ్దుల్ కలాంకు నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు



నన్నయలో అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్ ఆచార్య స్వామి తదితరులు

బిక్కవోలు: భారతరత్న మాజీ ఉప రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని మోళ్లూరు ఉన్నత పాఠశాల హెచ్ఎం లక్ష్మి అన్నారు. బుధవారం అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయుడు గొలుగూరి వెంకటరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనపర్తి: పులగుర్త ఆర్ఐవీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతి వేడుకలను నిర్వహించారు. ఇన్‌చార్జి హెచ్ఎం టీవీ సురేంద్ర ఆధ్వర్యంలో అబ్దుల్ కలాం చిత్ర పటానికి ఉపాధ్యాయులు పూలమాలలు వేశారు. ఉపాధ్యాయులు గొల్లపల్లి సత్యనారాయణ, జయశ్రీ, దుర్గాప్రసాద్, లక్ష్మి, రాజేశ్వరి, ఎస్‌పీఎల్ కుసుమ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

'నన్నయ'లో..

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి పూలమాల వేసి నివాళులర్పించారు. క్షిపణి శాస్త్రవేత్తగా, భారత దేశ 11వ రాష్ట్రపతిగా దేశం కోసం ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, అధ్యాపకులు పాల్గొన్నారు.

పేదలకు వైద్య విద్య దూరం చేసేందుకు కుట్ర



అనపర్తిలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సూర్యనారాయణరెడ్డి



ఇల్లపల్లిలో ర్యాలీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తదితరులు

- ప్రభుత్వ విధానాలను తిప్పికొడదాం
- మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి

బిక్కవోలు: పేదలకు వైద్య విద్యను దూరం చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నిందని, ఇందులో భాగంగా వైద్య కళాశాలలను ప్రైవేటీకరణ చేస్తుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దుయ్యబట్టారు. ఇల్లపల్లి గ్రామంలోని కోటి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సత్తి సూర్యనారాయణరెడ్డి మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి 17 వైద్య కళాశాలలను తీసుకొస్తే, ప్రస్తుత కూటమి ప్రభుత్వం వాటిని ప్రైవేటీకరించేందుకు కుట్రలు చేస్తోందని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రైవేటీకరణ ప్రతిపాదన విరమించుకోకపోతే వైఎస్సార్ సీపీ తరఫున పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పేదలకు ఉచితంగా వైద్యం అందించాలనే లక్ష్యంలో ఆనాడు మహానేత రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ ప్రవేశపెడితే, నేడు అనారోగ్యశ్రీగా మార్చేసి ప్రైవేట్ ఆసుపత్రులకు బకాయిలు చెల్లించకుండా నీరుగార్చుతుందని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వానికి పేదల శ్రేయస్సు కంటే ఆ పార్టీ నాయకుల క్షేమమే ముఖ్యమని దుయ్యబట్టారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి వైద్య కళాశాలల ప్రైవేటీకరణ వల్ల జరిగే నష్టాలను వివరించారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొందన్నారు. ముఖ్యంగా అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, అతని కుమారుడి అరాచక పాలనకు వ్యతిరేకంగా తిరుగుబాటు కూడా ఇల్లపల్లి నుంచే మొదలైందన్నారు. ఈ కోటి సంతకాల కార్యక్రమాన్ని ఇక్కడి నుంచే ప్రారంభించడం గొప్ప అనుభూతి మిగిల్చిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సబ్బెళ్ల కృష్ణారెడ్డి, మండల కన్వీనర్ పోతుల ప్రసాద్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షుడు, సర్పంచ్ లొల్ల భద్రం, రాష్ట్ర బూత్ కమిటీ విభాగ కార్యదర్శి బొడ్డు ముత్యాలరావు, నాయకులు సాధనాల రాంబాబు, గువ్వల సత్తిరెడ్డి, పల్లి రాజశేఖర్, వైము చిరంజీవి, నక్కా వీరబాబు, పొసుమంచి నాగు తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణకు శ్రీకారం

అనపర్తి: వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని బుధవారం నియోజకవర్గ కోఆర్డినేటర్ డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అనపర్తి పార్టీ కార్యాలయంలో తొలి సంతకం చేసి ప్రారంభించారు. పేదలకు ఉచిత వైద్యం అందించాలనే లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తెచ్చిన 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నాలను వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రజల ఆరోగ్యం, విద్యను కాపాడే ఈ పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, అనపర్తి, బిక్కవోలు మండలాల పార్టీ కన్వీనర్లు సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు), పోతుల ప్రసాదరెడ్డి (బుజ్జి) తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు

రంగంపేట: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో బెల్ట్ షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ డి.సుధ హెచ్చరించారు. బుధవారం ఆమె మాట్లాడుతూ తమ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎటువంటి కల్తీ మద్యం లేదని, తరచూ దాడులు నిర్వహిస్తున్నామన్నారు. అనధికార బెల్టు షాపులు నిర్వహిస్తున్న 76 మందిపై కేసులు నమోదు చేసి 1,202 మద్యం బాటిళ్లు సీజ్ చేశామన్నారు. అదేవిధంగా 65 మందిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసి, నలుగురు బైండోవర్ ఉల్లంఘించినందుకు గాను రూ. 33 వేల జరిమానా విధించినట్టు తెలిపారు.

సారా విక్రయిస్తే పీడీ యాక్ట్

సీతానగరం: నాటు సారా వ్యాపారం, అనధికార మద్యం షాపులు నిర్వహిస్తే పీడీ యాక్ట్ పెడతామని కోరుకొండ ఎక్సైజ్ సీఐ శ్రీనివాస బాలాజీ హెచ్చరించారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో దాడులు నిర్వహించారు. ప్రొహిబిషన్ ఎక్సైజ్ పరిధిలో గత ఏడాది సెప్టెంబర్ 13 నుంచి ఇప్పటి వరకూ మద్యం అనధికార విక్రయదారులపై దాడులు చేసి 100 కేసులు నమోదు చేశామని ఆయన అన్నారు. సీతానగరం, కోరుకొండ, గోకవరం మండల గ్రామాల్లో నాటుసారా నిర్మూలనకు గ్రామ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ఎక్సైజ్ ఎస్సై శ్రీనివాస్ పాల్గొన్నారు


బాలికల హక్కులపై అవగాహన

అనపర్తి: అంతర్జాతీయ బాలికా వారోత్సవాల్లో భాగంగా వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో అనపర్తి కేఏఆర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా బాలికల హక్కులు తదితర అంశాలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఆడపిల్ల పుట్టుకను అడ్డుకోవడం చట్ట విరుద్ధమని వివరించారు. అనంతరం ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహించారు. ఎంపీహెచ్ఈఓ చింతపల్లి శ్రీనివాస్, హెల్త్ సూపర్‌వైజర్ పి.శ్రీనివాస్, ఏఎస్ఎం చంద్రలక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి జీవిత చరిత్రపై నేడు బుర్రకథ

రంగంపేట: భగవాన్ సత్య సాయిబాబా శత వర్ష జయంతి సందర్భంగా కోటపాడు గ్రామంలో సత్యసాయి సేవా సదన్ వద్ద గురువారం రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకూ సత్యసాయి జీవిత చరిత్రపై బుర్రకథ ఏర్పాటు చేసినట్టు సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కందర్ప వెంకట అమర్నాథ్ చెప్పారు. సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు బులుసు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో సత్యసాయి అవతార వైభవం గురించి ద్రాక్షారామకు చెందిన ప్రముఖ బుర్రకథ కళాకారులు గొర్రెల రాము, కృష్ణమూర్తి, శ్రీనివాసరావులు తెలపనున్నారని చెప్పారు.

ఆధ్యాత్మికత పెంపొందించడానికి కృషి



వంద భజనల కార్యక్రమంలో మాట్లాడుతున్న అమర్నాథ్

రంగంపేట: ప్రతి గ్రామంలో వంద భజనా కార్యక్రమాలు ఏర్పాటు చేసి, ఆధ్యాత్మిక చింతన పెంపొందించడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కందర్ప వెంకట అమర్నాథ్ సూచించారు. కోటపాడు సేవా సమితి పరిధిలోని కొత్త నాయకంపల్లి గ్రామంలో సత్యసాయి భజన మండలి సభ్యురాలు ఉండవల్లి గంగాభవాని ఇంటి వద్ద జరిగిన 100 పాటల భజన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.

నల్రావుల దివ్యశ్రీ, సాయిసూర్య తేజలు బాబావారికి ప్రత్యేక పూజలు చేసి, హారతులు ఇచ్చారు. పామర్రు సేవా సమితి కన్వీనర్ తూము మాధవరావు, తిక్కిశెట్టి గోవిందరాజులు, కందర్ప శ్రీరామమూర్తిశర్మ, ఎల్.శ్రీనివాసరాజు, కందర్ప భానుమతి, పాలచర్ల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలను ఆదుకోవాలి



వెంకటకృష్ణ కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

పెదపూడి: రాయవరంలో ఈ నెల 8న బాణసంచా తయారీ కేంద్రంలో జరిగిన అగ్ని ప్రమాదంలో మృతులు, బాధిత కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. వేండ్ర గ్రామానికి చెందిన లింగం వెంకటకృష్ణ అగ్ని ప్రమాదంలో గాయపడి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతూ ఈ నెల 12న మృతి చెందాడు. ఆ కుటుంబాన్ని బుధవారం మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తక్షణమే పరిహారం ప్రకటించి బాధిత నిరుపేద కుటుంబాలను ఆదుకోవాలన్నారు. గత ప్రభుత్వంలో ఇలాంటి సంఘటనలు జరిగితే 24 గంటల్లోనే పరిహారం ప్రకటించి అందించామని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం బాధితుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. బాధితుల తరఫున న్యాయ పోరాటం చేస్తానని చెప్పారు. గ్రామ సర్పంచ్, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షుడు కోసూరి వాసు, పార్టీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి నాగుమళ్ల వీరభద్రరావు, నాయకులు కోసూరి సూరిబాబు, సుందరపల్లి వీరభద్రరావు, దార దొరబాబు, రొక్కాల సత్తిబాబు, అంబటి చంటి, తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు స్వాములు

బిక్కవోలు: కొంకుదురు గ్రామంలోని బుడిత మామిడి వద్ద అయ్యప్ప స్వామి ఆలయం నుంచి స్వాములు శబరిమల యాత్రకు బయలు దేరారు. ఆలయం వద్ద గురుస్వామి వెలగల చల్లారెడ్డి ఆధ్వర్యంలో 45 మంది స్వాములు యాత్రగా వెళ్లారు. స్వాములు చింతా శ్రీనివాస్‌రెడ్డి, సప్పా నాగేశ్వరరావు (నాని), కూండపు దుర్గాప్రసాద్, బి.సురేష్, బి.వీర్రాఘవ, పడాల సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.